మోగిన తొలి దశ భేరి

21 రాష్ట్రాల్లోని 102 లోక్‌సభ సీట్లకు నోటిఫికేషన్

- నామినేషన్లు ప్రారంభం
- వచ్చే నెల 19న పోలింగ్



న్యూఢిల్లీ/ఈటానగర్, మార్చి 20: ఏడు దశల్లో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల సంగ్రామానికి తొలి అడుగు పడింది. కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం తొలి దశ నోటిఫికేషన్ విడుదల చేసింది. మొదటి విడతలో భాగంగా 21 రాష్ట్రాలు/యూటీల్లోని 102 లోక్‌సభ నియోజకవర్గాలకు ఏప్రిల్ 19న ఎన్నికలు జరుగనున్నాయి. బుధవారం నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 27వరకు గడువు ఉంటుంది. మార్చి 28న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 30లోగా అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చు. అయితే పండుగ దృష్ట్యా బీహార్‌కు సంబంధించి ఈ షెడ్యూల్‌లో స్వల్ప మార్పు ఉంటుందని అధికారులు వెల్లడించారు. అక్కడ నాలుగు స్థానాలకు నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ 28గా ఉన్నది. 30న నామినేషన్లను పరిశీలించనున్నారు.

మొదటి దశలో పోలింగ్ ఎక్కడెక్కడంటే..
తమిళనాడులోని మొత్తం 39 స్థానాలకు ఈ తొలి విడతలోనే ఎన్నికలు జరుగుతాయి. రాజస్థాన్‌లో 12, ఉత్తరప్రదేశ్‌లో 8, మధ్యప్రదేశ్‌లో 6, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, అస్సాంలో ఐదు స్థానాల చొప్పున, బీహార్‌లో 4, పశ్చిమబెంగాల్‌లో 3, అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మేఘాలయలో రెండేసి చొప్పున, ఛత్తీస్‌గఢ్, మిజోరం, నాగాలాండ్, త్రిపుర, అండమాన్ నికోబార్, జమ్ముకశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరిలో ఒక్కో లోక్‌సభ స్థానానికి ఎన్నికలు జరుగనున్నాయి.

అరుణాచల్ అసెంబ్లీ ఎన్నికలకూ నోటిఫికేషన్
అరుణాచల్‌ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం విడిగా నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఏప్రిల్ 19న రాష్ట్రంలోని 60 అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటుగా రెండు లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఈ రెండు ఎంపీ స్థానాలను బీజేపీ గెలుచుకొన్నది. అదేవిధంగా అసెంబ్లీ ఎన్నికల్లో 41 స్థానాల్లో గెలిచింది. జేడీయూ ఏడు ఎమ్మెల్యే స్థానాలను దక్కించుకోగా.. కాంగ్రెస్ కేవలం నాలుగు స్థానాలకు మాత్రమే పరిమితమైంది. కాగా, అరుణాచల్ వెస్ట్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా ప్రస్తుతం కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పోటీచేస్తున్నారు.

రాజకీయ ప్రకటనలు వెంటనే తొలగించాలి

కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం రాష్ట్రాలకు కీలక ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ, పబ్లిక్, ప్రైవేటు ప్రాపర్టీల నుంచి అన్ని రకాల అనధికార రాజకీయ ప్రకటనలను(కటౌట్లు, హోర్డింగ్‌లు, గోడలపై రాతలు, పోస్టర్లు) వెంటనే తొలగించాలని స్పష్టం చేసింది. గురువారం సాయంత్రం 5 గంటలల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి, అన్ని రాష్ట్రాలు, యూటీల ప్రధాన కార్యదర్శులకు ఈసీ లేఖ రాసింది. షెడ్యూల్ ప్రకటనతో ఈ నెల 16 నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పటికీ, పలుచోట్ల రాజకీయ ప్రకటనలను తొలగించలేదని తమకు ఫిర్యాదులు అందినట్టు పేర్కొన్నది. తమ ఆదేశాలను పాటించకున్నా, పాక్షికంగా అమలు చేసినా తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించింది.

మోదీ గ్యారెంటీ పేరుతో వదంతులు

- పోస్టాఫీస్‌లో అకౌంట్ తెరిస్తే 3 వేలు జమవుతుందని ప్రచారం
- పోస్టాఫీసులకు పోటెత్తిన జనం..కర్ణాటకలోని హుబ్బ ళిలో ఘటన

హుబ్బళి, మార్చి 20: పోస్టాఫీస్‌లో అకౌంట్ ఓపెన్ చేస్తే రూ. 3 వేలు జమ అవుతాయని, ఇది మోదీ ప్రభుత్వ గ్యారెంటీ అని కర్ణాటకలోని హుబ్బళిలో వదంతులు వ్యాపించడంతో సమీపంలోని పోస్టాఫీసులకు మహిళలు పోటెత్తారు. ఇది నిజం కాదని ఎంత చెప్పినా జనం వినే పరిస్థితి కనిపించ లేదు. మంగళవారం రాత్రి 8 గంటల వరకూ పోస్టాఫీసుల దగ్గర జనం పడిగాపులు కాచారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రధాని మోదీ తరచూ మోదీ గ్యారెంటీ అని ప్రచారం చేస్తున్నారు. దీంతో కొంత మంది మోదీ గ్యారెంటీ కింద డబ్బులు వస్తాయని తప్పుడు సమాచారాన్ని ప్రచారంలో పెట్టారు. పోస్టాఫీస్‌లో బీపీఎల్ కార్డు ఉన్న మహిళలు అకౌంట్ ఓపెన్ చేస్తే వారి ఖాతాలో ప్రతి మూడు నెలలకు రూ.3 వేలు జమ అవుతాయని పుకారు పుట్టించారు. దీన్ని నమ్మిన జనం ఉదయం నుంచే పోస్టాఫీసుల వద్ద భారీ సంఖ్యలో గుమిగూడారు. వారికి నచ్చచెప్పలేక పోస్టల్ అధికారులు నానా అవస్థలు పడ్డారు.

కావాలనే వివాదం సృష్టిస్తున్నారు!

- ఎన్నికల కమిషనర్ల నియామకాలపై సుప్రీంకోర్టులో కేంద్రప్రభుత్వం అఫిడవిట్

న్యూఢిల్లీ, మార్చి 20: ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసే సెలక్షన్ కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తప్పించే ఎన్నికల ప్రధాన కమిషనర్, కమిషనర్ల నియామక చట్టం - 2023ను కేంద్రంసమర్థించుకొన్నది. పిటిషనర్లు కావాలనే వివాదం సృష్టిస్తున్నారని పేర్కొన్నది. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ చట్టం ప్రకారం కొత్త ఎన్నికల కమిషనర్లను నియమించొద్దని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు వచ్చే ముందు రోజే(మార్చి 14న) హడావుడిగా ఇద్దరు ఎన్నికల కమిషనర్లను నియమించారన్న పిటిషనర్ల వాదనను న్యాయశాఖ వ్యతిరేకించింది. సెలక్షన్ కమిటీ ఫలానా పద్ధతిలో ఉంటేనే ఏ సంస్థ స్వతంత్రత అయినా కొనసాగుతుందనడం సరికాదని పేర్కొన్నది. ఈసీ అయినా, మరే సంస్థ స్వతంత్రతైనా సెలక్షన్ కమిటీలో జ్యుడీషియల్ సభ్యుడు ఉండటంపై ఆధారపడి ఉండదని న్యాయశాఖ పేర్కొన్నది. కొత్త ఎన్నికల కమిషనర్ల అర్హతలపై ఎలాంటి అభ్యంతరాలు రాలేదనే విషయాన్ని ప్రస్తావించింది. అర్హుల జాబితాను ప్రతిపక్షానికి ఇవ్వలేదని పిటిషనర్లు చేసిన వాదన తప్పని, మార్చి 13నే కమిటీ ఎంపిక చేసిన ఆరుగురితో కూడిన జాబితాను లోక్‌సభ ప్రతిపక్ష నేత అధిర్ రంజన్ చౌదరికి అందించినట్టు తెలిపింది. కాగా, ఈ కేసు గురువారం సుప్రీంకోర్టులో విచారణకు రానున్నది.

అయోధ్య తరహాలో సీతమ్మకు ఆలయం

- బీహార్‌లోని సీతామండీ జిల్లాలో కొత్త మందిరం నిర్మాణం
- అదనంగా 50 ఎకరాల సేకరణకు ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- ఆలయ నిర్మాణానికి పబ్లిక్ ట్రస్టు!

న్యూఢిల్లీ: అయోధ్యలో రామ మందిరం మాదిరిగానే బీహార్‌లోని సీతామండీ జిల్లాలో సీతమ్మకు భవ్యమైన ఆలయం నిర్మితం కానున్నది. ఇందుకు అవసరమైన ప్రణాళికలు వేగంగా సాగుతున్నాయి. సీతామండీని సీత జన్మస్థలంగా భావిస్తారు. అక్కడ కొత్త ఆలయాన్ని నిర్మించడం కోసం ఇప్పుడున్న ఆలయం చుట్టూ 50 ఎకరాలు సేకరించాలని బీహార్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రాథమికంగా నిర్ణయించింది. ఆలయ నిర్మాణాన్ని ప్రభుత్వం కాకుండా.. అయోధ్య ట్రస్టులాగానే ఒక పబ్లిక్ ట్రస్టు నిర్మించనున్నదని, ఆ ట్రస్టే విరాళాలు సేకరిస్తుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మాజీ ఎమ్మెల్సీ కామేశ్వర్ చౌపాల్ మాట్లాడుతూ సీతామండీలో 100 ఏండ్ల క్రితం నిర్మితమైన ఒక ఆలయం ఉన్నదని, అది చాలా పాతపడిపోయిందని తెలిపారు. కొత్త ఆలయ నిర్మాణ వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు బ్రెయిన్ సర్జరీ

నిలకడగా ఆరోగ్యం

న్యూఢిల్లీ, మార్చి 20: ఇషా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు బ్రెయిన్ సర్జరీ నిర్వహించారు. 66 ఏండ్ల జగ్గీ వాసుదేవ్ గత నాలుగు వారాల నుంచి తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్నారు. అయినప్పటికీ ఈ నెల 8న జరిగిన శివరాత్రి ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అయితే మెదడులో రక్తస్రావం అవుతుండటంతో ఈ నెల 17న ఆయనకు అత్యవసరంగా శస్త్రచికిత్స చేశామని, ప్రస్తుతం ఆయన వెంటిలేటర్‌పై ఉన్నట్టు ఇంద్రప్రస్థ అపోలో హాస్పిటల్ తెలిపింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు.

భారత సంతతి ఐర్లాండ్ ప్రధాని రాజీనామా

లండన్, మార్చి 20: ఐరిష్ ప్రధాన మంత్రి, భారత సంతతికి చెందిన లియో వరాద్కర్ ప్రధాని పదవికి అలాగే తన పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు బుధవారం ప్రకటించారు. వారసుడిని ఎన్నకోగానే ప్రధాని పదవికి రాజీనామా చేస్తానని చెప్పారు. వ్యక్తిగత, రాజకీయ కారణాలతోనే వైదొలుగుతున్నట్టు పేర్కొన్నారు. 45 ఏండ్ల వరద్కర్ 2017- 2020 మధ్య, మళ్లీ డిసెంబర్ 2022 నుంచి ఐర్లాండ్ ప్రధానిగా కొనసాగుతున్నారు. ఐర్లాండ్‌కు అతి చిన్న వయసులో ఎన్నికైన ప్రధానిగా లియో గుర్తింపు పొందారు. అలాగే ఐర్లాండ్ మొట్టమొదటి స్వలింగ సంపర్కుడైన ప్రధాని కూడా వరద్కరే. అతని తల్లి ఐరిష్ కాగా.. తండ్రి భారతీయుడు.

తప్పుడు పత్రాలతో 21 లక్షల సిమ్‌లు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో సుమారు 21 లక్షల సిమ్‌కార్డులను తీసుకొన్నట్టు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ (డీవోటీ) తెలిపింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డిజిటల్ ఇంటెలిజెన్స్ విభాగం సాయంతో నిర్వహించిన విశ్లేషణలో ఇది తేలినట్టు వెల్లడించింది. ఆయా పత్రాలను వెంటనే రీవెరిఫికేషన్ చేయాలని ఎయిర్‌టెల్, ఎంటీఎన్‌ఎల్, బీఎస్‌ఎన్‌ఎల్, జియో, వీఐ తదితర టెలికం సంస్థలకు సూచించింది. ఒకవేళ ఆ పత్రాలు బోగస్ అని తేలితే సిమ్‌లను రద్దు చేయాలని సిఫారసు చేసింది.

కేంద్ర మంత్రి కరంద్లాజేపై కేసు

బెంగళూరు రామేశ్వరం పేలుడు ఘటనపై వివాదాస్పద వ్యాఖ్యలు

మదురై: రామేశ్వరం కెఫే పేలుడు ఘటనపై వివావాదస్పద వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి శోభా కరంద్లాజేపై కేసు నమోదైంది. రెండు రాష్ట్రాల మధ్య శత్రుత్వాన్ని రెచ్చగొట్టేలా మాట్లాడారన్న ఫిర్యాదు మేరకు మదురై పోలీసులు కేసు రిజిస్టర్ చేశారు. కరంద్లాజే ఇటీవల మాట్లాడుతూ తమిళనాడులో శిక్షణ పొంది, అక్కడ నుంచి కర్ణాటకకు వచ్చిన వ్యక్తులు బాంబులు పెట్టారని వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి వ్యాఖ్యలపై తమిళనాడు సీఎం స్టాలిన్ తీవ్రంగా మండిపడ్డారు. కరంద్లాజే నిర్లక్ష్యంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వ్యాఖ్యలపై దుమారం రేగడంతో కరంద్లాజే క్షమాపణలు చెప్పారు. వివాదాస్పద వ్యాఖ్యలతో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన కరంద్లాజేపై చర్యలు తీసుకోవాలని ఈసీ కర్ణాటక ఎన్నికల ప్రధాన అధికారిని ఆదేశించింది.

ఐసిస్ ఇండియా చీఫ్ అరెస్ట్

గువాహటి: ఐసిస్ ఇండియా చీఫ్, అతని అనుచరుడిని బుధవారం అస్సాంలోని ధుబ్రి జిల్లాలో పోలీసులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) ధర్మశాల దగ్గర వారిని పట్టుకున్నట్టు అస్సాం పోలీస్ చీఫ్ పీఆర్వో ప్రణబ్‌జ్యోతి గోస్వామి తెలిపారు. పట్టుబడిన వారిలో ఒకరు హరీష్ అజ్మల్ ఫరూఖీగా గుర్తించారు. ఇతను ఇండియాలో ఐసిస్ చీఫ్‌గా వ్యవహరిస్తున్నాడు. మరొకరు అనురాగ్ సింగ్. వీరు ఐసిస్‌లో దేశమంతా రిక్రూట్‌మెంట్, ఫండింగ్, టెర్రర్ చర్యలను చేపట్టే పనిలో ఉన్నారు. దేశంలో ఐసిస్‌ను విస్తరించే పనిలో భాగస్వాములు. వీరిద్దరిపై ఎన్ఐఏ, ఢిల్లీ, ఏటీఎస్, లక్నో తదితర ప్రాంతాల్లో చాలా కేసులు పెండింగ్ ఉన్నాయని పోలీస్ అధికారి తెలిపారు.

'ఉచిత హామీలు ఇచ్చే పార్టీల గుర్తింపు రద్దు చేయాలి'

న్యూఢిల్లీ, మార్చి 20: ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించడానికి రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత హామీలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. ఉచిత హామీలు ఇచ్చే పార్టీల గుర్తింపు రద్దు చేసేలా, ఎన్నికల గుర్తులు ఫ్రీజ్ చేసేలా ఈసీకి ఆదేశాలు ఇవ్వాలంటూ అశ్విని ఉపాధ్యాయ్ అనే పిటిషనరు సుప్రీంకోర్టును కోరారు. ఇటీవలి కాలంలో రాజకీయ పార్టీలు ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేయడానికి ఇస్తున్న ఉచిత హామీలు ప్రజాస్వామ్య విలువల ఉనికికే ప్రమాదకరంగా మారాయని, రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ముందే తమ పిటిషన్‌ను విచారించాలని కోర్టును పిటిషనరు తరఫు న్యాయవాది విజయ్ హన్సారియా విజ్ఞప్తి చేశారు. బుధవారం ఈ పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు.. ఇది ముఖ్యమైనదని, గురువారం విచారిస్తామని పేర్కొన్నది.

ముఖ్యమంత్రి సమ్మతితోనే గవర్నర్ నియామకం!

ఎన్నికల మ్యానిఫెస్టోలో డీఎంకే హామీ

చెన్నై, మార్చి 20: వచ్చే సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని తమిళనాడులోని అధికార డీఎంకే కొన్ని సంచలన హామీలతో తమ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను బుధవారం విడుదల చేసింది. డీఎంకే భాగస్వామిగా ఉన్న ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి ఆమోదంతోనే గవర్నర్‌ను నియమించే విధానాన్ని అమల్లోకి తెస్తామని పార్టీ చీఫ్, సీఎం ఎంకే స్టాలిన్ హామీ ఇచ్చారు. అంతేకాకుండా పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పిస్తామని, నీట్ పరీక్షను రద్దు చేస్తామని, సీఏఏను తొలగిస్తామని చెప్పారు. అలాగే జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేస్తామని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని, మహిళలందరికీ నెలకు వెయ్యి రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని, రాష్ట్రాలకు సమాఖ్య హక్కులను కల్పించేందుకు భారత రాజ్యాంగంలో మార్పులు తెస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మ్యానిఫెస్టోను తయారు చేసిన తన సోదరి కనిమొళికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభకు పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఆయన విడుదల చేశారు.

మళ్లీ బీజేపీలో చేరిన తమిళిసై

చెన్నై, మార్చి 20: తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ బుధవారం తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై సమక్షంలో తిరిగి ఆ పార్టీలో చేరారు. తమిళిసైపై డీఎంకే, వామపక్షాలు చేసిన విమర్శలను అన్నామలై ప్రస్తావిస్తూ.. ఉన్నత పదవుల్లో ఉన్న వారు పదవీ విరమణ చేసి సాధారణ వ్యక్తిగా ప్రజల కోసం మళ్లీ పనిచేయడం ఒక్క బీజేపీలోనే సాధ్యమన్నారు. బీజేపీ కాకుండా ఇతర రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులు పదవులు వదులుకోరని, వారికి ఎంతసేపు పదవులపై వ్యామోహం అని ఆయన ఆరోపించారు. 2019లో తమిళిసై తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందే బీజేపీకి రాజీనామా చేశారు. 2021లో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కూడా తమిళిసై వ్యవహరించారు. 62 ఏండ్ల తమిళిసై గైనకాలజిస్ట్. రెండు దశాబ్దాల క్రితం ఆమె బీజేపీలో చేరారు.

ఇద్దరు చిన్నారుల దారుణహత్య

నిందితుడి ఎన్‌కౌంటర్.. యూపీలో ఘటన

బదౌన్, మార్చి 20: యూపీలో దారుణం చోటుచేసుకుంది. ఆర్థిక సహాయం కోసం పొరుగు ఇంటికి వెళ్లిన వ్యక్తులు వారి ఇద్దరు పిల్లలను దారుణంగా గొంతు కోసి చంపడం సంచలనం సృష్టించింది. బదౌన్‌లో ఈ ఘటన చోటు చేసుకున్నది. ఇటీవలే బార్బర్ షాపును ప్రారంభించిన సాజిద్ (22), అతని సోదరుడు జావేద్.. షాపుకు ఎదురుగా ఉన్న కాంట్రాక్టర్ వినోద్ ఇంటికి వెళ్లి గర్భవతి అయిన తన భార్యను దవాఖానలో చేర్చానని, రూ.5 వేలు సాయం చేయాలని అభ్యర్థించాడు. ఆ సమయంలో ఇంట్లో కాంట్రాక్టర్ తల్లి, భార్య, పిల్లలు ఉన్నారు. దాంతో కాంట్రాక్టర్ భార్య సంగీత డబ్బు తేవడానికి లోపలికి వెళ్లగా, ఇంటి పై భాగంలో సంగీత నడుపుతున్న బ్యూటీ సెలూన్‌ను చూద్దామంటూ సాజిద్ వారి పిల్లలను మేడపైకి తీసుకెళ్లి గొంతుకోశాడు. ఆయుష్ (12), ఆహాన్ (8) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరో కుమారుడు యువరాజ్ (10) దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ దారుణానికి పాల్పడిన తర్వాత బయట బైక్‌పై వేచి చూస్తున్న సోదరుడు జావేద్‌తో సాజిద్ పరారయ్యాడు. అయితే నిందితులు ఈ దారుణానికి ఎందుకు పాల్పడిందీ తెలియరాలేదు. పసిపిల్లలను పొట్టనబెట్టుకున్న ఇద్దరు నిందితులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. నిందితుడి దుకాణాన్ని స్థానికులు తగులబెట్టారు. సంఘటన జరిగిన కొన్ని గంటలకే మంగళవారం సాయంత్రం పోలీసులు సాజిద్‌ను ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు. మరో నిందితుడు జావెద్ పరారీలో ఉన్నాడు. కాగా, మృతుల కుటుంబానితో తన కుమారులకు ఎలాంటి విరోధం లేదని, వారు చేసిన చర్యలకు తగిన ఫలితం అనుభవించారని నిందితుల తల్లి పేర్కొంది. ఈ హత్యతో నగరంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

పన్నూ హత్యకు కుట్రలో అధికారుల పాత్ర!

భారత దర్యాప్తులో తేలిందని బ్లూమ్‌బర్గ్ కథనం

న్యూఢిల్లీ: అమెరికా ఆరోపిస్తున్నట్టుగా న్యూయార్క్‌లో ఖలిస్థానీ నేత గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు పన్నిన కుట్రలో ప్రమేయం ఉన్న అధికారులను భారత ప్రభుత్వ దర్యాప్తులో గుర్తించినట్టు బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. అయితే వీరికి ప్రభుత్వ అనుమతి లేదని సంబంధిత అధికారులు తెలిపినట్టు పేర్కొన్నది. ఈ కుట్రలో ప్రత్యక్షంగా పాల్గొన్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ఒకరు ప్రస్తుతం నిఘా ఏజెన్సీ 'రిసెర్చ్ అండ్ అనాలసిక్ వింగ్(రా)'లో పనిచేయడం లేదని, అయితే అతను ప్రభుత్వ ఉద్యోగిగానే ఉన్నాడని తెలిపింది.

కేంద్ర అధీకృత ఫ్యాక్ట్‌చెకర్‌గా పీఐబీ

న్యూఢిల్లీ: ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోకు(పీఐబీ) చెందిన ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఇక నుంచి కేంద్ర ప్రభుత్వ అధీకృత ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌గా పని చేయనున్నది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఐటీ నిబంధనలు-2021 కింద ఈ నిర్ణయం తీసుకొన్నట్టు పేర్కొన్నది. ఇకపై ఫ్యాక్ట్ చెక్ ఒక నోడల్ ఏజెన్సీగా ఉంటుందని, దాని పర్యవేక్షణలో కేంద్రపై తప్పుడు సమాచారం వ్యాప్తిని అరికట్టడమే లక్ష్యమని తెలిపింది. ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌ను నోటిఫై చేయకుండా కేంద్రాన్ని నిరోధించేందుకు బాంబే హైకోర్టు నిరాకరించిన కొద్ది రోజులకు తాజా నోటిఫికేషన్ విడుదలైంది.

మా దేశానికి రండి!

మోదీకి పుతిన్, జెలెన్‌స్కీ ఆహ్వానం

న్యూఢిల్లీ: భారత్‌లో లోక్‌సభ ఎన్నికలు ముగిశాక తమ దేశానికి రావాల్సిందిగా అటు రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇద్దరూ ప్రధాని మోదీని ఆహ్వానించారు. పుతిన్ మరోసారి దేశాధ్యక్షుడిగా ఎన్నికైన నేపథ్యంలో ప్రధాని మోదీ పుతిన్‌తో ఫోన్లో సంభాషించారు. ఆ తర్వాత కొంత సేపటికే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో కూడా మాట్లాడారు.

దివ్యాంగులు నిలబడేలా..

చెన్నై: దివ్యాంగులు ఎప్పుడూ వీల్‌చైర్‌లో కూర్చోవాల్సిందేనా? చిన్న చిన్న పనులకూ ఇతరులపై ఆధారపడాల్సిందేనా? అంటే అవసరం లేదని అంటున్నారు ఐఐటీ మద్రాస్ శాస్త్రవేత్తలు. దివ్యాంగులు లేచి నిలబడి చిన్న చిన్న పనులు చేసుకునేందుకు వీలుగా ఎలక్ట్రిక్ స్టాండింగ్ వీల్‌చైర్‌ను అభివృద్ధి చేశారు. దీని పేరు 'నియోస్టాండ్'. మన దేశంలో అభివృద్ధి చేసిన మొదటి స్టాండింగ్ వీల్‌చైర్ ఇది. దీని ధర రూ.89,990గా నిర్ణయించారు. త్వరలోనే మార్కెట్‌లోకి రానుంది.

1% సంపన్నుల వద్ద 40.1% సంపద

భారత్‌లో తీవ్రమవుతున్న ఆర్థిక అసమానతలు

న్యూఢిల్లీ, మార్చి 20: భారత్‌లో ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, 1 శాతం జనాభా చేతిలో 40.1 శాతం సంపద ఉన్నదని పలువురు ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. 'భారతదేశంలో ఆదాయ, సంపదలో అసమానతలు, 1922 - 2023: ది రైజ్ ఆఫ్ ది బిలియనీర్ రాజ్' పేరుతో వివిధ అంతర్జాతీయ ఆర్థిక సంస్థలకు చెందిన థామస్ పికెట్టి, లుకాస్ ఛాన్సెల్, నితిన్ కుమార్ భారతి ఒక నివేదిక రూపొందించారు. 2014 - 15 నుంచి 2022 - 23 మధ్యకాలంలో సంపదను కేంద్రీకరించడం వల్ల ఈ అసమానతలు ఎక్కువగా పెరిగాయని ఈ నివేదిక పేర్కొన్నది.

- 022 - 23లో మొత్తం దేశ ప్రజల ఆదాయంలో టాప్ 1 శాతం సంపన్నుల వాటా 22.6 శాతమని, సంపదలో వీరి వాటా 40.1 శాతమని, ఇది ప్రపంచంలోనే అత్యధికమని నివేదిక తెలిపింది.
- దేశంలోని 167 సంపన్న కుటుంబాల నికర సంపదపై 2022 - 23లో 2 % 'సూపర్ ట్యాక్స్' విధించి ఉంటే జాతీయ ఆదాయంలో 0.5% అయ్యేదని నివేదిక పేర్కొన్నది.
- పన్నుల విధానాన్ని పునర్నిర్మించడం ద్వారా సంపన్నులకే కాకుండా సగటు భారతీయుడికి విద్య, వైద్యం, పోషకాహారం అందించేందుకు వెచ్చించాల్సిన అవసరం ఉందని తెలిపింది.

జూన్ 23న నీట్ పీజీ పరీక్ష

న్యూఢిల్లీ: నీట్ పీజీ 2024 పరీక్షను జూన్ 23న నిర్వహించనున్నట్టు బుధవారం నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) ప్రకటించింది. మొదట జులై 7న పరీక్ష జరిపేందుకు షెడ్యూల్ ఖరారు కాగా ఇప్పుడు జూన్ 23న నిర్వహించేందుకు రీషెడ్యూల్ చేసింది. మెడికల్ కౌన్సిలింగ్ కమిటీతో ఎన్ఎంసీ పీజీ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు జరిపిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. నీట్ పీజీ పరీక్ష ఫలితాలు జులై 15న వెలువడనున్నాయి. ఆగస్టు 5వ తేదీ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు అడ్మిషన్ల కోసం కౌన్సిలింగ్ జరుగుతుంది. సెప్టెంబర్ 16 నుంచి కొత్త అకాడమిక్ సెషన్ ప్రారంభం కానున్నది.

బీహార్‌లో పేపర్ లీక్.. టీచర్ రిక్రూట్‌మెంట్ పరీక్ష రద్దు

పాట్నా: బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న టీచర్ రిక్రూట్‌మెంట్ పరీక్షల ప్రశ్నపత్రం లీక్ అయింది. పరీక్ష ప్రారంభానికి ముందే ఓ ముఠా చేతికి ఈ ప్రశ్నపత్రాలు చేరినట్లు సమాచారం. దీంతో ఈ నెల 15న రెండు షిఫ్టుల్లో జరిగిన టీచర్ రిక్రూట్‌మెంట్ పరీక్షలను రద్దు చేసినట్లు కమిషన్ బుధవారం ప్రకటించింది. ఈ పరీక్షలు జరిగే తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపింది. కమిషన్ చైర్మన్ పర్మార్ రవి మనుభాయ్ మాట్లాడుతూ, మూడో దశ పరీక్షను పూర్తిగా రద్దు చేసినట్లు చెప్పారు. ఆర్థిక నేరాల విభాగం ఈ పరీక్షలను రద్దు చేయాలని నివేదిచ్చింది.

ఐదేండ్ల ముందే.. గుండెపోటు గుర్తించొచ్చు!

లండన్, మార్చి 20: గుండె పోటు ముప్పును రక్తపరీక్ష ద్వారా ఐదేండ్ల ముందుగానే గుర్తించవచ్చని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ అధ్యయనం వెల్లడించింది.'న్యూరో పెప్టైడ్-వై (ఎన్‌పీవై) అనే ప్రొటీన్, దాంతోపాటు బీఎన్‌పీ అనే హార్మోన్ రక్తంలో ఏ మేరకు ఉన్నాయన్నది కొలవటం ద్వారా గుండె పోటు వచ్చే రోగులను గుర్తించవచ్చు. వీరు మరణించే ముప్పు ఎక్కువ. ఎన్‌పీవై అనేది గట్టి సంకేతమని మా పరిశోధన చెబుతున్నది' అని పరిశోధకులు తెలిపారు.

వెదురుతున్న సంతోషం!

- సంతోషకర దేశాల జాబితాలో అట్టడుగున భారత్
- బీజేపీ పదేండ్ల పాలనలో 15 ర్యాంకులు దిగజారిన వైనం
- మనకంటే మెరుగైన స్థానంలో పాక్, నేపాల్, ఇరాక్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): ప్రధాని నరేంద్రమోదీ పదేండ్ల పాలనలో దేశంలో ప్రజలెవరూ సంతోషంగా లేరు. బుధవారం అంతర్జాతీయ సంతోషకర దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్యసమితికి (ఐరాస) అనుబంధంగా పనిచేస్తున్న వెల్‌బీయింగ్ రిసెర్చ్ సెంటర్ 'వరల్డ్ హ్యాపీనెస్' రిపోర్ట్ విడుదల చేసింది. 143 దేశాలకు ఇచ్చిన ర్యాంకుల్లో భారత్ 126వ స్థానంలో నిలిచింది. ఫిన్లాండ్ ఏడోసారి తొలి ర్యాంకు సాధించి ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన దేశంగా రికార్డు సృష్టించింది. తాలిబన్ల పాలనలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న అఫ్గానిస్థాన్ జాబితాలో 143వ ర్యాంకుతో అట్టడుగున నిలిచింది.

ఏమిటీ నివేదిక?
వివిధ దేశాల్లో ప్రజల తలసరి జీడీపీ, సామాజికంగా వారికి లభిస్తున్న మద్దతు, జీవిత కాలం, స్వేచ్ఛ, అవినీతి రేటు, ఆత్మ సంతృప్తి తదితర అంశాల ఆధారంగా 'వరల్డ్ హ్యాపీనెస్' రిపోర్ట్‌ను ఏటా ఐరాస విడుదల చేస్తున్నది.

పదేండ్లలో పతనమే..
2014లో ప్రధాని మోదీ పగ్గాలు చేపట్టిన పుడు హ్యాపీనెస్ జాబితాలో ఇండియా ర్యాంకు 111గా ఉండేది. తాజా జాబితాలో భారత్ ర్యాంకు 126కు పడిపోయింది. అంటే గడిచిన పదేండ్లలో 15 ర్యాంకులను భారత్ కోల్పోయింది.

చిన్న దేశాలే మెరుగు
భారత్‌కు పొరుగున ఉన్న నేపాల్ (93), రాజకీయ, ఆర్థిక సంక్షోభాలను తరుచూ ఎదుర్కొనే ఇరాక్ (92), ఇరాన్ (100), నైజీరియా (102), పాకిస్థాన్ (108), ఉగాండా (117) వంటి దేశాలు జాబితాలో ఇండియా కంటే మెరుగైన ర్యాంకును సాధించడం గమనార్హం.



2014 నుంచి 2024 వరకూ భారత్ ర్యాంకింగ్స్

సంవత్సరం	ర్యాంకు
2014	111
2015	117
2016	118
2017	122
2018	133
2019	140
2020	144
2021	139
2022	136
2023	126
2024	126